batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

13 ఆగస్టు 2026
గురువారం

తాజా వార్తల సద్దిమూట

## వేటగాళ్ల కరెంట్ ఉచ్చుకు బీట్ ఆఫీసర్ బలి

వెబ్ డెస్క్, బతుకమ్మ :జంతువుల వేటకు పెట్టిన ఉచ్చు, ఫారెస్ట్ అధికారి ప్రాణం తీసింది. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో తీవ్ర విషాదం నింపింది. అటవీ శాఖ బీట్ ఆఫీసర్ నవీన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సింగారం వెస్ట్ బీట్ పరిధిలో విధి నిర్వహణలో అడవి జంతువుల వేటకు ముఠా వేసిన కరెంటు ఉచ్చును గుర్తించే క్రమంలో ప్రమాదం జరిగింది.

02



### మిల్లర్లు బకాయి పడిన

# ప్రతిబియ్యం గింజ సేకరించాల్సిందే

**ఐదు జిల్లాల్లో సైలో బ్యాగ్‌ల ఏర్పాటు పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలి**

**సీఎంఆర్ సమీక్షా లో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, బతుకమ్మ : మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తో కలిసి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు.

గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు .ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిని వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు.

02



### దివ్యాంగులకు సౌకర్యాలను

## మెరుగుపరచాలి

**ఎంపీ ధర్మపురి అర్వింద్**

వెబ్ డెస్క్, బతుకమ్మ: దివ్యాంగులకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యాల యాలు, విద్యా సంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాలను మెరుగుపరచాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్‌ను బుధవారం న్యూఢిల్లీలో ఆయన కలిశారు.



02

### తొలిసారిగా ఎర్రకోటపై

## వందేమాతరం..

**విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవంలో**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

02





02

## జంతర్ మంతర్ ధర్నాపై కేంద్రం స్పందన

**జర్నలిస్టుల వినతిపై చర్యలు ప్రారంభం**

**ప్రెస్ కౌన్సిల్‌కు కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లేఖ**

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో జూలై 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంపై చర్యలు ప్రారంభమయ్యాయి. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై ఫెడరేషన్ ప్రధానమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించింది.

## సిద్దిపేటలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

సిద్దిపేట, బతుకమ్మ :కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేటలో రియల్ ఎస్టేట్, వ్యాపార రంగాలు దెబ్బతిన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లైట్ మోటార్ వెహికల్స్ అసోసియేషన్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిద్దిపేట చిన్నబోయిందని, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పడిపోయాయని హరీశ్‌రావు అన్నారు. వ్యాపారాలు తగ్గిపోవడంతో ఎక్కడ చూసినా 'టు లెట్' బోర్డులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

02



# మిల్లర్లు బకాయి పడిన ప్రతిబియ్యం గింజ సేకరించాల్సిందే



స్వయం సహాయక సంఘాల (రాం+) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీబీ జీ రామ్ జీ( ఉపాధి హామీ పథకం )లో ప్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ప్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి , పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర , సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ను

# ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

## సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబరులో నిర్వహించనున్న ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ఏర్పాట్లు, నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని స్టేడియంల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా వాటిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, క్రీడాకారులు, అతిథులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు స్పష్టమైన పని విభజన చేసి బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని సీఎం సూచించారు. ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు, జాతీయ స్థాయి క్రీడా ప్రతినిధులను కూడా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించేలా మొత్తం నిర్వహణ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా మొత్తం 20 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో, ప్రతి క్రీడకు అనువైన వేదికలను ముందుగానే గుర్తించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణా రావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఎటిజి) చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌ఎటిజి ఎండీ ఎ. సోనీబాల దేవి తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేటలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి



గతంలో కార్లు, డీసీఎంలకు నెలకు 15 వరకు గిరాకీలు వచ్చేవని, ప్రస్తుతం ఆరు, ఏడు గిరాకీలు కూడా దొరకడం కష్టంగా మారిందన్నారు. దీంతో డ్రైవర్లు, వాహన యజమానుల జీవన పరిస్థితులు ఆర్థికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రహదారులపై గుంతలు లేకుండా అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ఏ రోడ్డు చూసినా గుంతలే కనిపిస్తున్నాయని ఆయన విమర్శించారు. పాత బస్‌స్టాండ్‌ను వేగంగా ఆధునికీకరించి పూర్తి చేశామని, అయితే ప్రస్తుతం 1000 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ, శిల్పారామం, రైల్వే బ్రిడ్జి, టూరిజం ప్రాజెక్టు వంటి పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయని ఆరోపించారు. సిద్దిపేటలో అన్ని రకాల విద్యా అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో ఎంబీబీఎస్, అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీలను తీసుకొచ్చామని హరీశ్‌రావు తెలిపారు. కలెక్టరేట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించడాన్ని ఆయన తప్పుపట్టారు. కొత్త విద్యాసంస్థలు ఏర్పాటు చేయవచ్చని, కానీ సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న కాలేజీని తరలించడం అన్యాయమని అన్నారు. ఈ దొంగ చర్యలను చూస్తూ ఊరుకోను. మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆగిపోయిన పనులన్నింటినీ రెట్టింపు వేగంతో పూర్తి చేస్తాం. సిద్దిపేటలో నిలిచిపోయిన అభివృద్ధిని పూర్తిచేసి తీరుతాం" అని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందుల కొరత ఉందని, దీంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆయన ఆరోపించారు. అయితే మంచి రోజులు వస్తాయని, ఎవరూ ధైర్యం కోల్పోవద్దని ప్రజలకు సూచించారు. వాహనాలు నడుపుతూ ఎక్కువ సమయం కూర్చునే డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హరీశ్‌రావు సూచించారు. రోజుకు కనీసం 40 నిమిషాలు నడవాలని, చెమట పట్టేలా వ్యాయామం చేయాలని చెప్పారు. గుట్కా, బీడీలు, సిగరెట్లు, మద్యం వంటి ఆరోగ్యానికి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. "తక్కువ తినండి.. ఎక్కువగా వాకింగ్ చేయండి. అవకాశం ఉన్నవారు యోగా చేయండి. మీరు ఆరోగ్యంగా ఉంటేనే మీ కుటుంబం సంతోషంగా ఉంటుంది" అని ఆయన అన్నారు.

# తొలిసారిగా ఎర్రకోటపై వందేమాతరం..



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తొలిసారిగా ఎర్రకోటపై వందేమాతరం గీతాలాపన చేయడం శుభ సూచికమని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. సంస్కార భారతి, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన సమయంలో వందేమాతరం నినాదం ఒక ఉద్యమ శక్తిగా మారింది అన్నారు జైలు శిక్షలు నాటి దెబ్బలు తూటాలు ఎదురైన స్వాతంత్ర సమరయోధులు ఈ నినాదాన్ని విడిచిపెట్టలేదన్నారు. 150 ఏళ్ల చరిత్రలో ఒక గొప్ప ప్రయాణం వందేమాతరందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వందేమాతరంపై పలు అంశాలపై పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. అలాగే కళాభారతి సంబంధించి ఇప్పటికే అనేకసార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం అన్నారు. అరకొర నిధుల విడుదలతో ముందుకు సాగడం లేదని తెలిపారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్కార భారతి అధ్యక్షులు రాజకుమార్ సుభేదర్, ట్రస్మా అధ్యక్షులు కిషోర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ ధర్నాపై కేంద్రం స్పందన

వినతిపత్రంలో అక్రిడిటెడ్ జర్నలిస్టులకు 50 శాతం రైల్వే ఛార్జీ రాయితీ పునరుద్ధరణ, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సౌకర్యాన్ని తిరిగి కల్పించడం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యకు చట్టపరమైన పరిష్కారం చూపడం, స్వతంత్ర నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు వంటి డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించడం లేదా అవసరమైన సవరణలు చేయడం, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఉద్యోగులకు రక్షణ కల్పించడం, కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయడం, జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయడం తదితర అంశాలను కూడా వినతిలో పేర్కొన్నారు. సంబంధిత అంశాలను పరిశీలించేందుకు ఫిర్యాదును మీడియా యూనిట్ సెల్--×కి బదిలీ చేసినట్లు రిజిస్ట్రేషన్ వివరాల్లో నమోదైంది. ఇదిలా ఉండగా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఆగస్టు 8న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కార్యదర్శికి అధికారిక లేఖ జారీ అయింది. టీడబ్ల్యూజెఎఫ్ తరఫున మామిడి సోమయ్య సమర్పించిన ఫిర్యాదును ప్రస్తావించిన మంత్రిత్వ శాఖ, జర్నలిస్టుల సంక్షేమం, సేవా పరిస్థితులు, చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత, కార్మిక హక్కులకు సంబంధించిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని పీసీఐ ని కోరింది. ఫిర్యాదును వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని కూడా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సూచించినట్లు టీడబ్ల్యూజెఎఫ్ తెలిపింది. దీంతో జంతర్ మంతర్ ధర్నా సందర్భంగా జర్నలిస్టులు లేవనెత్తిన సమస్యలపై కేంద్ర స్థాయిలో ప్రక్రియ ప్రారంభమైనట్లు ఫెడరేషన్ పేర్కొంది.


# దివ్యాంగులకు సౌకర్యాలను మెరుగుపరచాలి

నిజామాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయాల్సిన అవసరాన్ని ఎంపీ వివరించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం నిర్వహించే అంచనా శిబిరాలను మరింత విస్తరించాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని అర్వింద్ తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి సహకరిస్తున్న కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ అర్వింద్ చేసిన విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి డా. వీరేంద్ర కుమార్ సానుకూలంగా స్పందించారు. దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# వేటగాళ్ళ కరెంట్ ఉచ్చుకు బీట్ ఆఫీసర్ బలి

రాత్రి 9 గంటల సమయంలో సిబ్బందితో కలిసి వెళ్లిన అధికారి నవీన్ విధి నిర్వహణలో కరెంట్ షాక్ తో మృతి చెందాడు. మృతదేహాన్ని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన మోడేగావ్ సర్పంచ్



ఎల్లారెడ్డి, బతుకమ్మ :ఎమ్మెల్యే మదన్ మోహన్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సదాశివనగర్ మండలం మోడేగావ్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మోడే గావ్ గ్రామ సర్పంచ్ కొండెల్లి గంగాధర్‌తో పాటు జువ్వాడ భిక్షపతి, దాసరి భాస్కర్, పెద్ద రాజయ్య, జువ్వల శ్రీనివాస్, బెస్త రాములు తదితరులు ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ వంటి పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో మోడేగావ్ గ్రామంలో రూ.35 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.10 లక్షలతో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) భవనానికి నిధుల మంజూరు చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం తమను ఆకర్షించిందని నాయకులు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషి, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరుగుతోందని వారు అన్నారు. మోడేగావ్ గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని కొత్తగా పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ ఉపసర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోషలిస్టు వ్యవస్థ కోసం సీతారాం నిరంతరం కృషి చేశారు

### సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : దేశంలో మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుతూ, కమ్యూనిస్టు సిద్ధాంతాల ఆధారంగా సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం సీతారాం ఏచూరి నిరంతరం కృషి చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో బీజేపీ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సమయంలో పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల గొప్పతనాన్ని, వారి పోరాట పటిమను చాటిన నాయకుడు ఏచూరి అని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేయడంలో, సోషలిస్టు భావజాలాన్ని విస్తరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని రమేష్ బాబు తెలిపారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలాన్ని అలవర్చుకున్న ఏచూరి, విద్యార్థుల సమస్యలను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ధైర్యంగా ప్రశ్నించారని గుర్తుచేశారు. సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం, దేశంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం లక్ష్యంగా సీపీఎం నిరంతరం కృషి చేస్తుందని రమేష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, నగర కమిటీ సభ్యులు అనసూయమ్మ, ఉద్దవ్, అనిత, నాయకులు అంజయ్య, రాజు, మాధవి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్‌లో 1.5 శాతం కోత నిలిపివేయాలి

### తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకోకుండానే గత మూడు నెలలుగా పెన్షనర్ల నుంచి 1.5 శాతం చొప్పున పెన్షన్‌లో కోత విధించడాన్ని తెలంగాణ ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. బుధవారం నిజామాబాద్‌లోని పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి గత మూడు నెలల్లో సుమారు రూ.250 కోట్లను వసూలు చేసినప్పటికీ ఇప్పటివరకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సంఘం గౌరవాధ్యక్షుడు కే. రామ్మోహన్‌రావు ఆరోపించారు. గత ఆరు నెలలుగా హెల్త్ కార్డులు ఇస్తామంటూ పెన్షనర్లను తిప్పుతున్నారే తప్ప, ఇప్పటివరకు కార్డులు జారీ చేయలేదని జిల్లా అధ్యక్షుడు శిర్ప హనుమాన్లు విమర్శించారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపానెల్డ్ ఆసుపత్రుల అంగీకారం పొంది, హెల్త్ కార్డులు జారీ చేసే వరకు పెన్షన్‌లో 1.5 శాతం కోత విధించే ప్రక్రియను నిలిపివేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఈవిల్ నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ప్రసాదరావు, పురుషోత్తంరావు, చంద్రశేఖర్, రాజేశ్వర్, సాంబశివరావు, లంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### టీవీయువీ నగర అధ్యక్షులు సుభాష్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :చందూర్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులపై వేధింపులు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయువీ) నగర అధ్యక్షులు సుభాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీవీయువీ ప్రతినిధులు బుధవారం ఏబీసీడబ్ల్యూఓ భాగ్యవతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్ కల్పలత క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను కొట్టడంతో పాటు మానసికంగా వేధిస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అలాగే వార్డెన్ భర్త కూడా హాస్టల్‌కు వచ్చి విద్యార్థులను బెదిరించడం, నిర్బంధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, గౌరవం, హక్కులను దృష్టిలో ఉంచుకుని ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఆరోపణలు విచారణలో నిజమని తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీసీడబ్ల్యూఓ భాగ్యవతిని కోరినట్లు సుభాష్ తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు భయరహితమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వెయ్యి కోట్ల టన్నెల్ లోకి వరద నీరు

### ప్రారంభమైన 13 రోజులకే మూసివేత



వెబ్ డెస్క్, బతుకమ్మ :ఢిల్లీ - ముంబై హైవేపై నిర్మించిన ముకుంద్రా టన్నెల్‌లోకి భారీగా వర్షపు నీరు చేరి మడుగులా మారింది. సుమారు రూ.1,000 కోట్లతో నిర్మించిన ఈ టన్నెల్‌లో డ్రైనేజీ వ్యవస్థ విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మరో టన్నెల్‌లో కొండచరియలు విరిగిపడటంతో పూణే రహదారిపై వారం రోజుల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు లక్నో - కాన్పూర్ ఎక్స్‌ప్రెస్ హైవే 84 కిలోమీటర్ల మేర వర్షాలకు దెబ్బతిన్నట్లు సమాచారం. టోల్ ప్రారంభించిన 13 రోజులకే దానిని నిలిపివేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పలు రహదారి ప్రాజెక్టులు భారీ వర్షాలకు దెబ్బతింటుండటంతో నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# వసతిగృహ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

### పీడీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాల్ రాజ్



బోధన్, బతుకమ్మ :చందూర్‌లోని బీసీ బాలుర వసతిగృహ వార్డెన్‌పై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఫ్రంట్ (పీడీఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాల్ రాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం బోధన్ ఆర్డీఓ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన వసతి గృహ వార్డెన్ కల్పలత విద్యార్థులపై సిగరెట్లు తాగుతున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేసి, అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు సుమారు 10 మంది విద్యార్థులపై దౌర్జన్యంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు తెలిపారు. విద్యార్థులపై అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేసి వారిని ఇబ్బందులకు గురిచేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ పీడీఎస్ఎఫ్ నాయకులు పి.గణేష్, సన్నీ పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య



హైదరాబాద్, బతుకమ్మ :హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 2024 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ జర్కుల సాయికుమార్ పోలీస్ స్టేషన్‌లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాత్రి విధుల్లో ఉన్న సమయంలో ఈ ఘటన జరగడం స్థానికంగా, పోలీసు శాఖలో తీవ్ర కలకలం రేపింది. సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడటానికి అసలైన కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే సాయికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించడంపై కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శవపంచనామాకు ఎలా తరలిస్తారని వారు నిలదీశారు. అధికారుల వేధింపుల వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని, సాయికుమార్ మొబైల్ ఫోన్‌ను వెంటనే తమకు ఇవ్వాలని కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, వేధింపులే ఈ బలవన్మరణానికి కారణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ ఆత్మహత్యపై అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహనకు
## షార్ట్ ఫిలిం ఆవిష్కరణ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించిన 'మన ఆరోగ్యం మన చేతుల్లోనే' అనే షార్ట్ ఫిలింను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ ఆవిష్కరించారు. గోవిందపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస ఆధ్వర్యంలో రూపొందించిన ఈ షార్ట్ ఫిలింకు కోకిల నాగరాజు రచన, దర్శకత్వం వహించారు. షార్ట్ ఫిలిం ఆవిష్కరణ సందర్భంగా డాక్టర్ బి. రాజశ్రీ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు తదితర సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో రూపొందించిన ఈ షార్ట్ ఫిలిం వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఇటువంటి వినూత్న కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా షార్ట్ ఫిలింలో నటించిన విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు, వైద్యాధికారి డాక్టర్ మానస, ఉపాధ్యాయుడు, రచయిత, దర్శకుడు కోకిల నాగరాజులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### దోస్త్ 2026-27 స్పెషల్ ఫేజ్‌లో
## విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ 2026-27 స్పెషల్ ఫేజ్‌లో భాగంగా ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగుల ప్రత్యేక విభాగాలకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎన్‌సీసీ విభాగానికి చెందిన ఇద్దరు, స్పోర్ట్స్ విభాగానికి చెందిన ఒకరు, దివ్యాంగుల విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు కలిపి మొత్తం ఐదుగురు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు యూనివర్సిటీ దోస్త్ సమన్వయకర్త డాక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమర్పించిన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్. నేతతో పాటు నరేశ్, దిలీప్, రవీందర్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కౌలాస్ నాలా ప్రాజెక్టుకు భారీగా వరద నీరు
### 457.45 మీటర్లకు చేరిన నీటిమట్టం



జుక్కల్, బతుకమ్మ :కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 140 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివకుమార్ తెలిపారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 458.00 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 457.45 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతోందని ఏఈ పేర్కొన్నారు. ప్రాజెక్టు నీటిమట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని గమనిస్తున్నారు. ప్రస్తుత నీటి ప్రవాహం నేపథ్యంలో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించిన కలెక్టర్





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయాన్ని, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాలలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. పాఠశాలల పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. కేజీబీవీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. సువిశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అన్ని వసతులతోకూడిన క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని, పాఠశాలల ప్రవేశ మార్గంలో ప్రధాన ద్వారం వద్ద అందరికీ కనిపించేలా మెనూ బోర్డును ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కేజీబీవీ లో బాలికల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే విషయమై సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడతానని అన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్.ఓ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, జిల్లా వ్యాప్తంగా గల అన్ని కేజీబీవీలలో ఆర్.ఓ ప్లాంట్లు, సోలార్ హీటర్లు వినియోగంలోకి తెచ్చేందుకు మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు. రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో వరి ధాన్యం, ఇతర కూరగాయలను సాగు చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ నిర్వాహకులను అభినందించారు. బాలికల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ లను సందర్శించి, విద్యార్థినులకు ఆంగ్లం సబ్జెక్ట్ లో పాఠాలు బోధించారు. పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని విద్యార్థినులకు ప్రేరణ కల్పించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీలార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక, రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

# వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ భుజంగరావు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని, వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు సూచించారు. జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహించనున్న విస్తృత అవగాహన కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీతో కలిసి ఎయిడ్స్ పై నిర్వహించనున్న ఐఈసీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ కు సంబంధించిన ప్రమాదకర పరిస్థితులను తెలుసుకునేందుకు ఉపయోగపడే 'బ్రేక్ ఫ్రీ యాప్' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో భాగంగా జిల్లాలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఈ అవగాహన కార్యక్రమాలు రెండు నెలల పాటు కొనసాగుతాయని తెలిపారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. బుధవారం నుంచి రెండు నెలల పాటు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 200 కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు, అలాగే 200 ఎంపిక చేసిన గ్రామాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యువతలో చైతన్యం పెంచేందుకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు బైక్ ర్యాలీ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవి నాగేశ్వరి (టీబీ నియంత్రణ అధికారి), డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ సుప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ గన్‌పూర్ వెంకటేష్, డీపీఎం సుధాకర్, సీపీఓ మొహిజ్ అహ్మద్, సీఎస్ఓ నవీన్, స్నేహ సొసైటీకి చెందిన సిద్దయ్య, డీపీఓ విశాల, హెచ్ఈఓ గోవర్ధన్, నాగరాజుతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్నేహ సొసైటీ, వర్డ్, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, వైఆర్‌జీ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవసరాల ఆధారిత కనీస వేతనాన్ని నిర్ణయించాలి




### టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కార్మికుల వాస్తవ అవసరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరాల ఆధారిత కనీస వేతనాలను నిర్ణయించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర అధ్యక్షులు కే. సూర్యం డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఈ నెల 20న నిర్వహించనున్న ఆందోళనలను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. టియుసిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల సమస్య దేశంలోని ప్రతి కార్మికుడిని ప్రభావితం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేస్తున్న చట్టబద్ధమైన కనీస వేతనాలు కార్మికులు, వారి కుటుంబాల వాస్తవ అవసరాలకు అనుగుణంగా లేవని పేర్కొన్నారు. దీంతో లక్షలాది మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు గౌరవప్రదమైన జీవన ప్రమాణాలను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధమైన కనీస వేతనం నిజమైన అవసరాల ఆధారంగా ఉండాలని టియుసిఐ డిమాండ్ చేస్తోందన్నారు. 1957లో జరిగిన 15వ భారత కార్మిక సదస్సు (ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్) నిర్దేశించిన శాస్త్రీయ ప్రమాణాలకు, 1992లో సుప్రీంకోర్టు గుర్తించిన సూత్రాలకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించాలని కోరారు. ఒక కార్మికుడు, అతని జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లల కుటుంబానికి అవసరమైన ఆహారం, దుస్తులు, పిల్లల విద్య, వైద్యం, వినోదం, పండుగల ఖర్చులతో పాటు వృద్ధ తల్లిదండ్రుల పోషణకు అవసరమైన వ్యయాలను భరించగలిగే స్థాయిలో కనీస వేతనం ఉండాలని సూర్యం అన్నారు. మే 2026లో ఉన్న రిటైల్ ధరలను ప్రాతిపదికగా తీసుకుని చట్టబద్ధమైన కనీస వేతనాన్ని నెలకు రూ.39,373గా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం. నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. వెంకన్న, డి. రాజేశ్వర్, సహాయ కార్యదర్శి బి. కిషన్, జిల్లా నాయకులు బి. మురళి, డి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు నిరంతరం దాడులు కొనసాగించాలి





## పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

బోధన్, బతుకమ్మ :డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిరంతరం కొనసాగించాలని, అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. బోధన్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పురోగతి, శాంతిభద్రతల పరిరక్షణపై బుధవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. కోటగిరి పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పేకాట, గుట్కా, ఇసుక తదితర అక్రమ కార్యకలాపాలపై కూడా విస్తృతంగా దాడులు నిర్వహించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై నిఘా ఉంచి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బోధన్ డివిజన్‌లో నమోదైన హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా తదితర కేసుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. పెండింగ్ కేసులను వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన నిందితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని కమిషనర్ సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టం చేయాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవేలను కలుపుతున్న లింక్ రోడ్ల వద్ద అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించడం, రహదారులకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి నేషనల్ హైవే, స్టేట్ హైవే అధికారులు, ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ఓవర్‌స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో రోడ్డు భద్రతా నిబంధనలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 సేవలను వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ఈ సేవల గురించి ప్రతి వర్గం ప్రజలకు అవగాహన కల్పించేలా పోలీస్ అధికారులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలను 24 గంటలూ కొనసాగించాలని, తనిఖీల సమయంలో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి

# మూడేళ్ల ప్రణాళికలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





కామారెడ్డి, బతుకమ్మ :గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా మూడేళ్ల సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. 2026--27 నుంచి 2028--29 ఆర్థిక సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, ఆరోగ్యం, ఉపాధి, నీటి సంరక్షణ వంటి ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. చేయూత సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి ఏడు రకాల పింఛన్లకు అర్హులైన వారి నుంచి వచ్చిన దరఖాస్తులను గ్రామస్థాయిలో స్వీకరించి, అర్హతలను పరిశీలించి, సంబంధిత ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా పారదర్శకంగా దరఖాస్తులను పరిశీలించాలని, అర్హత ఉన్న వారికి నిబంధనల మేరకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ సమగ్ర ప్రణాళికల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, లబ్ధిదారులకు అందించాల్సిన సహకారం, నిర్మాణ పురోగతి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జలశ్రీ కార్యక్రమం కింద వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు గ్రామపంచాయతీ ప్రణాళికల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చెరువులు, కుంటలు, కాలువలు, ఇంకుడు గుంతలు, పొలాల కుంటలు, భూగర్భ జలాల పునర్భరణకు సంబంధించిన పనులను గ్రామ అవసరాలకు అనుగుణంగా గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని తెలిపారు. ప్రతి చుక్క వర్షపు నీటిని సంరక్షించే విధంగా గ్రామస్థాయిలో చర్యలు చేపట్టాలని అన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామపంచాయతీలకు అందుబాటులోకి వచ్చే నిధులను గ్రామాల ప్రాధాన్యత అవసరాలకు అనుగుణంగా, నిబంధనల మేరకు సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ సమగ్ర ప్రణాళికల తయారీలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, గ్రామ సభల ద్వారా అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. రూపొందించిన ప్రణాళికల అమలును అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యన్.వై. గిరి, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, డీపీఓ మురళి, సీఈవో చందర్, ఎంపీడీవోలు, ఎంఈఓలు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా..

# నగరంలో జాతీయ పతాకాల పంపిణీ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరు త్రివర్ణ పతాకాలను తమ ఇంటిపై ఆవిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని గాంధీ చౌక్ లో బుధవారం త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత స్వాతంత్రానికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాతీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ 2022లో హారిక తిరంగా ప్రారంభించారన్నారు. ప్రతి ఇంటిపై జెండా ఎగరవేసి ప్రజల్లో దేశభక్తి జాతీయ జెండాపై వ్యక్తిగత అనుబంధాన్ని పెంచడం దీని ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. 2022 ఆగస్టు 3న అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఢిల్లీలో ఎర్రకోట నుంచి ఇండియా గేట్ వరకు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ ని నిర్వహించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, ఎర్రం సుధీర్, బంటు రాము, బంటు ప్రీతి, శ్యామల, మల్కాయి మహేందర్, సునీత రాజు, బొబ్బిలి సువర్ణ వేణు, వైష్ణవి సుధా, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, జ్యోతి మురళి, మోర్చాల నాయకులు పాల్గొన్నారు.



## నేతాజీ యువజన సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో నేతాజీ యువజన సంఘం 40వ వార్షికోత్సవ వేడు కలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రుస్తుం రమేష్, క్యాషియర్‌గా కోడలి పవన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రుస్తుం రమేష్, క్యాషియర్ కోడలి పవన్ మాట్లాడుతూ.. నేతాజీ యువజన సంఘం 40వ వార్షికోత్సవం సందర్భంగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, యువత సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ మహిళా ప్రిన్సిపాల్ దారుణ హత్య

### కొండమల్లేపల్లిలో ఘటన



దేవరకొండ, బతుకమ్మ :నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి లో జె బి కాలనీలో నివాసం ఉంటున్న నాగార్జున గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూప రెడ్డి అనే మహిళ దారుణ హత్యకు గురైంది. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఎస్సెస్సీ విద్యార్థులకు 'సక్సెస్ ఆపరేటింగ్ సిస్టమ్'పై ప్రత్యేక శిక్షణ



బిచ్కుంద, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని న్యూ ఆర్కిడ్స్ పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు 'సక్సెస్ ఆపరేటింగ్ సిస్టమ్ (ఎస్ఓఎస్) పై రెండు గంటల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోమైండ్స్ అధినేత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు కె. గంగాధర్ విద్యార్థులకు లక్ష్య నిర్దేశం, సమయ నిర్వహణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పరీక్షల భయాన్ని అధిగమించే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో పరస్పర చర్చలు, వివిధ కార్యకలాపాల ద్వారా శిక్షణను ఇంటరాక్టివ్‌గా, ఉత్సాహ భరి తంగా నిర్వహించారు. ఎస్సెస్సీ పరీక్షలను భయపడకుండా ఆత్మవి శ్వాసంతో ఎదుర్కొని, మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలి పారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ గోపీ సార్తో పాటు పాఠశాల యాజమాన్యం సహకారం అందించింది. విద్యార్థుల్లో సానుకూల ఆలో చనా విధానం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## అక్రమ మొరం తరలింపు

### పట్టించుకోని అధికారులు



కామారెడ్డి, బతుకమ్మ :మండ లంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలో అక్రమంగా మొరం తవ్వకాలు, తరలింపు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండానే మొరం తవ్వకాలు చేపట్టి, వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విష యాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మొరం తవ్వకాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడంతో పాటు, గ్రామ పరిసరాల్లో పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ మొరం తవ్వకాలు, తరలింపును అరికట్టడంతో పాటు, అనుమతులు లేకుండా ఈ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## బీట్ ఆఫీసర్ మృతికి కారకులైన వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఇందల్వాయి, బతుకమ్మ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేటగాళ్లు వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం తీవ్రంగా బాధాకరమని ఇందల్వాయి అటవీ రేంజ్ అధికారి రవి మోహన్ బట్ అన్నారు. ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ నవీన్‌కు రాత్రి సుమారు 9 గంటల సమయంలో వన్యప్రాణుల వేట కోసం అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చినట్లు సమాచారం అందిందన్నారు. సమాచారం మేరకు నవీన్ సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతానికి వెళ్లి తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు రేంజ్ అధికారి తెలిపారు. వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వల్లే ఈ విషాద ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రవి మోహన్ బట్ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు.

# గ్రామీణ యువతకు చేరువైన బాక్స్ క్రికెట్



బిచ్కుంద, బతుకమ్మ :ఒకప్పుడు నగర ప్రాంతాలకే పరిమితమైన బాక్స్ క్రికెట్ సంస్కృతి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తోంది. బిచ్కుందలో ఆధునిక సదుపాయాలతో బాక్స్ క్రికెట్ గ్రౌండ్ అందుబాటులోకి రావడంతో స్థానిక యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. గ్రామీణ యువత ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ సేవలను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. నగరాలతో పోలిస్తే సరసమైన ధరలకు టర్ఫ్ సదుపాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సాహిల్ షెట్కర్ మాట్లాడుతూ, నగరాల్లో అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను గ్రామీణ యువతకు కూడా అందించాలనే ఉద్దేశంతో బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించామని తెలిపారు. అధిక రుసుములు యువతకు భారంగా మారకుండా ధరలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆధునిక టర్ఫ్, చుట్టూ నెట్టింగ్, ఫ్లడ్‌లైట్లతో ఏర్పాటు చేసిన ఈ గ్రౌండ్‌లో యువత క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ ఆడేందుకు ఆసక్తి చూపుతోంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో యువకులతో గ్రౌండ్ సందడిగా మారుతోంది. నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఆధునిక సదుపాయాలతో క్రీడలు ఆడుకునే అవకాశం లభించడంపై గ్రామీణ యువత హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ తరహా క్రీడా వేదికలు గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా అందుబాటులోకి వస్తే యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# విశ్వహిందూ పరిషత్ అనుబంధ విభాగాలకు బాధ్యుల నియామకం




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ:విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఇందూరు జిల్లా కార్యాలయంలో మాతృశక్తి, దుర్గావాహిని మహిళా కార్యకర్తల పరిచయ వర్గ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ప్రాంత మాతృశక్తి సంయోజిక పద్మశ్రీ, ప్రాంత సహ సంయోజిక శ్రీవాణి ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలు ఇంటి బాధ్యతలకే పరిమితం కాకుండా సమాజంలోనూ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సనాతన ధర్మం పట్ల అవగాహన పెంపొందించుకుని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని సమర్థవంతంగా స్పందించే శక్తిగా ప్రతి మహిళ ఎదగాలని పిలుపునిచ్చారు. నారీశక్తిని మరింత బలోపేతం చేసేందుకు మహిళా కార్యకర్తలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమం అనంతరం విశ్వహిందూ పరిషత్ అనుబంధ విభాగాలకు నూతన బాధ్యతలను ప్రకటించారు. ఇందూరు జిల్లా మాతృశక్తి సంయోజికగా గాయత్రి, జిల్లా సహ సంయోజికగా జమున, నగర సంయోజికగా అర్చన, సహ సంయోజికగా లాస్య, సత్సంగ్ ప్రముఖ్‌గా సుశీల, బాల సంస్కార కేంద్ర ప్రముఖ్‌గా భాగ్య, సేవా ప్రముఖ్‌గా శ్యామలను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, వీహెచ్‌పీ గోరక్ష విభాగ్ ప్రముఖ్ దాత్రిక రమేష్, కోశాధికారి నాంపల్లి శేఖర్, జిల్లా సేవా ప్రముఖ్ రాంప్రసాద్ చెటర్జీతో పాటు పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులను భావితరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలి

### జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రతి అధ్యాపకుడు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ, వారిని భావితరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ శిక్షణా తరగతులు వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతున్నాయని ఆయన అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రెండో స్పెల్‌లో కామర్స్, ఫిజిక్స్, హిస్టరీ, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించిన రెండు రోజుల ఓరియంటేషన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యాబోధన చేయాలని సూచించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొన్న పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ రెండు రోజుల ఓరియంటేషన్ తరగతులు తమ బోధనా నైపుణ్యాలను, వృత్తిపరమైన సామర్థ్యాన్ని మరింత పెంపొందించాయని తెలిపారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ కామర్స్ లో నారాయణ, శ్రీనివాస్, ఫిజిక్స్ లో ఫణికుమార్, నాగేశ్వరయ్య, జువాలజీలో సుభాష్, శ్రీనివాస్, హిస్టరీలో రవికుమార్, దేవన్న అధ్యాపకులకు వివిధ బోధనా మెళకువలు, ఆధునిక పద్ధతులపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చిన్నయ్య, అబ్బర్వర్ ధర్మపాల్, జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏర్గట్ల పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ





ఏర్గట్ల, బతుకమ్మ :వసంత టూల్స్ ట్రస్ట్ అధ్యక్షులు, దానగుణ సంపన్నులు దయానంద రెడ్డి సౌజన్యంతో ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు దయానంద రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఇప్పటికే పాఠశాలకు క్రీడా దుస్తులు, ఆట వస్తువులను అందించిన ఆయన, తాజాగా విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన కంప్యూటర్, ప్రింటర్‌ను అందించడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే పరికరాలను అందించడం గొప్ప సేవా కార్యక్రమమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. దయానంద రెడ్డి తరఫున పరికరాలను పాఠశాలకు తీసుకువచ్చిన ఆయన అప్తుడు రజనీష్‌ను ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మునీరుద్దీన్, విజయ్, రాజనర్సయ్య, రాజేందర్, గంగాధర్, ప్రవీణ్ శర్మ, ట్వింకిల్, గంగా మోహన్, సబిత, సమత జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ డిమాండ్ల అమలుకు టీఎంఆర్పీఎస్ వినతి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎంర్పీఎస్) ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. టీఎంర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. టీఎంర్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లని శివ మాదిగ నేతృత్వంలో జిల్లా కమిటీ సభ్యులు, డప్పు కళాకారులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టీఎంర్పీఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీలకు ప్రస్తుతం ఉన్న 15 శాతం రిజర్వేషన్‌ను 20 శాతానికి పెంచాలని కోరారు. చెప్పుకుంటూ, డప్పు వాయిస్తూ కళారూపాలను ప్రదర్శించే కళాకారులకు నెలకు రూ.5,000 పింఛన్ మంజూరు చేయాలని, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు హామీ ఇచ్చిన సామాజిక భద్రత పింఛన్లను అమలు



చేయాలని కోరారు. మాదిగ దండోరా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందించాలని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎస్సీలకు కేటాయించిన లావణి (అసైన్డ్) భూములను పూర్తిస్థాయిలో పట్టా భూములుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. పై ప్రజా సంక్షేమ డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించి అమలు చేయాలని టీఎంర్పీఎస్ నాయకులు కోరారు. ఈ



కార్యక్రమంలో టీఎంర్పీఎస్ పట్టణ అధ్యక్షులు బండారిపల్లి మల్లేష్ మాదిగ, నవీపేట్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ నవీన్ మాదిగ, టీఎంర్పీఎస్ డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు డప్పు సంతోష్ మాదిగ, అన్న బాబు సాటే సంఘం వ్యవస్థాపకులు కాంగ్రెస్ సాయి మాదిగ, ఎడపల్లి మండల అధ్యక్షుడు ఆకాశ్ మాదిగతో పాటు భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన డప్పు కళాకారులు మంద నరసయ్య, తెడ్డు గంగారం, ఓదుల బాబన్న, సిద్ధపల్లి నరసయ్య, దువల గంగారం, జన్ను బాబురావు, జన్ను బాబన్న, పత్రి భాస్కర్, డిచ్‌పల్లి మండలానికి చెందిన సతీష్, సాయిలు, శ్రీకాంత్, నడిపి సాయిలు, చిన్నయ్య, చిన్న సాయిలు, గంగాధర్, మహేష్, ఎడపల్లి మండలానికి చెందిన ఆకాష్, సురేష్, గంగాధర్, నిజామాబాద్ అర్బన్‌కు చెందిన నరసయ్య, కిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకోవాలి

## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ :గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, నీటి లభ్యత, ఎత్తిపోతల పరిస్థితులు, పెండింగ్‌లో ఉన్న పరిహారం, పునరావాస అంశాలపై చర్చించారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది పంపులతో ఎత్తిపోతలు చేపట్టినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశంలో వివరించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ మొత్తాలను వెంటనే చెల్లించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఉంటుందని తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలని సూచించారు. మరోవైపు,




జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డిఎస్ఎ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఎన్డిఎస్ఎ తో సంప్రదింపులు జరిపి, వారి సూచనలను పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సాగునీటి అవసరాలకు అందుబాటులో ఉన్న గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

# 5 రోజుల పని దినాల కోసం బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ధర్నా చౌక్‌లో భారీ నిరసన .....డిమాండ్ అమలు చేయకపోతే నిరవధిక సమ్మెకు హెచ్చరిక

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ధర్నా చౌక్‌లో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్ బియు) పిలుపు మేరకు, గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 5 రోజుల పని దినాల విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు తమ డిమాండ్‌పై ప్రభుత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారు. బ్యాంకింగ్ రంగంలో 5 రోజుల పని దినాలను అమలు చేయాలని, ఈ అంశాన్ని ఇకపై జాప్యం చేయకుండా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని 5 రోజుల పని దినాల డిమాండ్‌కు తమ సంపూర్ణ



సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్బిఐ ఎస్యుహెచ్సి డీజీఎస్ రమేశ్, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వర్, ఏజీఎస్ గురునాథ్, శ్రీనివాస్, సుప్రీం, ఆఫీసర్ అసోసియేషన్ డీజీఎస్ రాజు, సింగరావు, సునీల్, సతీశ్, మనోజ్ సింగ్, వంశీ క్రిష్ణ, నరేష్, ఉదయ్, అన్వేష్, మధు, రాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

ఇందల్వాయి, బతుకమ్మ :నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను మరింత వేగవంతం చేయాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు అవకాశం కల్పించాలని, తద్వారా పార్టీకి సేవలందించిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరుతూ, సీనియర్ నాయకులకు అవకాశం కల్పిస్తే ఎప్పటికీ రుణపడి ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన వారిలో మాజీ కోఆప్షన్ సభ్యులు శ్యాంసుందర్, ధర్మ గౌడ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



# మహనీయులు బాల్యం లో దేశ భక్తి ఉండేది

## తెలంగాణ ప్రాంత సహబౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :దేశం కోసం జీవించిన మహనీయులందరిలో చిన్ననాటి నుంచే దేశభక్తి, యువతలో దేశం కోసం తపన కనిపించిందని తెలంగాణ ప్రాంత సహబౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్ తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (ఆర్ఎస్ఎస్) శతాబ్ది వేడుకల్లో భాగంగా కోటగల్లి, గాజులపేట ఉపనగరాల యువ సమ్మేళనం టిటిడి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇందూర్ విభాగ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహబౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతే దేశానికి ప్రధాన ఆధారమని అన్నారు. ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశం భారత్ ఒక్కటేనని, యువత సరైన ఆలోచనా విధానంతో ముందుకు సాగితే దేశం అభివృద్ధి చెందడంతో పాటు భావితరాలు కూడా సన్మార్గంలో నడుస్తాయని పేర్కొన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల జీవితాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద వంటి మహనీయులు యువతకు స్ఫూర్తిదాయకులని పేర్కొన్నారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్రసంకల్పం కలిగిన యువకులే దేశానికి ఆధారం" అని స్వామి వివేకానందుడు చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, నేటి యువత మహనీయుల మార్గంలో నడవాలని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ, దేశహితమే తమ హితంగా భావించి బాధ్యతాయుతంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవాహ అరుగుల సత్యం, సుమిత్, రామకృష్ణ, శరత్, బున్ని నవీన్, భార్గవ్, కళాశాల విద్యార్థి ప్రముఖ్ మణితేజ, రంజిత్, శ్రావణ్, అభిరామ్, దర్బార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కారేగాం తాండాలో కొత్త పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ

చందూర్, బతుకమ్మ :చందూర్ మండలంలోని కారేగాం తాండా గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభ మైంది. ఈ విష యాన్ని గ్రామ సర్పంచ్ డాక్టర్ రామావత్ లాల్ సింగ్, పంచాయతీ కార్యదర్శి సీతారాం తెలిపారు. కొత్త పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రజలు అవసరమైన పత్రాలతో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని వారు సూచించారు. అర్హులైన వారు తమ పూర్తి వివరాలను అందించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం అధికారులు వాటిని పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. అర్హులైన ప్రజలు నిర్ణీత ప్రక్రియను పాటించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




# గేదెల దొంగల బీభత్సం...

## గేదెలను దొంగిలిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు

రుద్రూర్, బతుకమ్మ :గేదెను అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంప్ గ్రామానికి చెందిన పాడి రైతు గౌస్ పేర్కొన్నారు. గేదెలపైనే జీవనాధారం కొనసాగిస్తున్నామని, ఇంటి బయట కట్టేసిన గర్భం దాల్చిన గేదెను అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారన్నారు. గేదె విలువ సుమారు 1 లక్ష రూపాయాలు వరకు ఉంటుందని తెలిపారు. ఊరు బయట వరకు గేదెను తీసుకెళ్లి అక్కడి నుండి ట్రాలీ ఆటోలో తరలించినట్లు ఆనవాళ్లు ఉన్నాయని పాడి రైతు గౌస్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. గత కొన్ని రోజుల కిందట సులేమాన్ నగర్ గ్రామంలో, వారం రోజుల కిందట కోటగిరి, పోతంగల్ గ్రామాల్లో కూడా గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఆరోపణలు వినిపించాయన్నారు. గేదెలను దొంగిలిస్తున్న వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.



## అనుమానాస్పద స్థితిలో
# భార్యాభర్తల మృతదేహాలు



వెబ్ డెస్క్, బతుకమ్మ :మోతె మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి వెంట వ్యవసాయ భూమిలో పాక్షికంగా పాతిపెట్టిన స్థితిలో ఓ పురుషుడు, ఓ మహిళ మృతదేహాలు లభ్యమవడం కలకలం రేపింది. మృతులు బీక్యాతండాకు చెందిన బూబా, నాగుగా పోలీసులు గుర్తించారు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, స్థానిక ఎస్ఐతో పాటు క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, భూమిలో పాక్షికంగా పాతిపెట్టిన మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మృతదేహాలను ఎవరైనా హత్య చేసి మరో ప్రాంతం నుంచి తీసుకొచ్చి ఇక్కడ పాతిపెట్టి ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మోతె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఘటనకు కారణాలు, మృతుల మరణానికి సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో తేల్చనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భార్యాభర్తల మృతదేహాలు అనుమానాస్పద స్థితిలో లభించడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## బోర్లం బాలికల జూనియర్ కళాశాలలో కలెక్టర్, ఎస్పీ ఆకస్మిక తనిఖీ.
### విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీ



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని టీజీ ఎన్డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల (బాలికల)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యా బోధన, విద్యార్థినులకు అందుతున్న వసతులు, రికార్డులను వారు పరిశీలించారు.కళాశాలకు చేరుకున్న కలెక్టర్, ఎస్పీ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వారి చదువులు, కళాశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. బ్లాక్‌బోర్డుపై రాసిన పాఠాలు, పాఠశాల రిపోర్టులు, విద్యార్థినులు సాధించిన ట్రోఫీలను పరిశీలించారు. అధ్యాపకులతో బోధనా పద్ధతులు, విద్యార్థుల విద్యా ప్రగతిపై చర్చించా రు.వి ద్యార్థినులతో కలిసి భోజనం అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజ నం నాణ్యత, మెనూ, పరిశుభ్రతపై విద్యార్థినులను అడిగి తెలుసు కున్నా రు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా అవస రమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు ప్రోత్సాహం అందించారు.

**మౌలిక వసతులపై అధికారులకు సూచనలు**

కళాశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్ మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీసీఓ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్,పట్టణ సీఐ తుల శ్రీధర్,తహసీల్దార్, గిర్దావర్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

### ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పరిశీలన
### డిజిటల్ క్లాస్‌రూమ్‌ల తనిఖీ
### విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్కుల పంపిణీ





బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం పరిశీలించారు. కళాశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం డిజిటల్ క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు.విద్యార్థులకు అందుతున్న డిజిటల్ బోధనా విధానాలపై అధ్యాపకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.

**నూతన బోధనా పద్ధతులు అలవర్చుకోవాలి**

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న అధ్యాపకులను ఉద్దేశించి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా అధ్యాపకులు నూతన బోధనా పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, వారి భవిష్యత్తుకు సరైన మార్గనిర్దేశం చేసేలా బోధన సాగాలని అన్నారు.అధ్యాపకులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు.

**కళాశాల వాతావరణంపై ప్రశంస**

కళాశాల ప్రాంగణం పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటాన్ని కలెక్టర్ ప్రశంసించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సేవలను అభినందించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం మెమొంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రాజేశ్వర్,మున్సిపల్ కమీషనర్ గోవు గంగాధర్, ఎంపీడీవో ఆనంద్,కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు మహమ్మద్ ఎజాస్, దాసరి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫారుఖ్, లింగంపేట్ ప్రిన్సిపాల్ నరేందర్, బాన్సువాడ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యాదగౌడ్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏర్గట్లలో 240 గ్రాముల గంజాయి స్వాధీనం

### ముగ్గురు అరెస్ట్

ఏర్గట్ల, బతుకమ్మ :గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ఏర్గట్ల పోలీసులు చేపట్టిన ప్రత్యేక నిఘాలో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 240 గ్రాముల ఎండు గంజాయి, 37 ప్యాకెట్లు, ఒక స్కూటీ, మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 11న విశ్వసనీయ సమాచారం మేరకు బట్టాపూర్ గ్రామ శివారులోని పెద్దవాగు బ్రిడ్జి సమీపంలోని బీటీ రోడ్డుపై ఏర్గట్ల పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్కూటీపై అనుమానాస్పదంగా వచ్చిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులను నిజామాబాద్‌లోని అహ్మద్‌పూర్ కాలనీకి చెందిన షేక్ అజాం (36), మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అమోల్ దమ్మ పాల్ చౌరే (23), నిజామాబాద్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ (28)గా పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి 240 గ్రాముల ఎండు గంజాయితో పాటు గంజాయి తరలింపునకు ఉపయోగించిన స్కూటీ, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి ఏర్గట్ల మండలంలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ గౌడ్ పర్యవేక్షణలో ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్, మోర్తాడ్ ఎస్సై రాము ఆధ్వర్యంలో ఏర్గట్ల పోలీస్ సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కీలకంగా




వ్యవహరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే ఏర్గట్ల పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై పడాల రాజేశ్వర్ ప్రజలను కోరారు.

# శ్రీవారి భక్తులను మోసం చేసిన మాజీ ఉద్యోగి అరెస్ట్





వెబ్ డెస్క్, బతుకమ్మ :టిటిడిలో పనిచేస్తూ సస్పెండ్ అయిన ఉద్యోగులు భక్తులను నిలువునా మోసగిస్తున్నారు అడ్డంగా దొరికిపోతున్నారు. తాజాగా అలాంటి ఓ ఉద్యోగే శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తానంటూ భక్తులను మోసం చేసేందుకు ప్రయత్నించి కటకటాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. టీటీడీలో ఉద్యోగిగా పనిచేస్తూ సస్పెండ్ అయిన గిరిధర్ అనే వ్యక్తి.. అదే పోస్టును వాడుకొని భక్తులను మోసం చేయడం స్టార్ట్ చేశాడు. ఇలా భక్తులకు తన టీటీడీ ఐడీ కార్డును పంపి సేవా టికెట్ల పేరుతో రూ.1.56 లక్షలు వసూలు చేసినట్లు పోలీసుల గుర్తించారు. అంతేకాదు టీటీడీ ఉద్యోగం పేరుతో మరో వ్యక్తి నుంచి రూ.3.60 లక్షలు వసూలు చేసినట్టు కూడా పోలీసులు గుర్తించారు. ఇలా దాదాపు రూ.10 లక్షల మేర భక్తులను మోసం చేసి దండుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. దీంతో గిరిధర్‌పై కేసు నమోదు చేసిన తిరుమల టూ టౌన్ పోలీసులు అతన్ని కోర్టులో హాజరుపర్చారు. కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం అతనికి 15 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో అతన్ని రిమాండ్‌కు తరలించారు పోలీసులు. ఈ ఘటన నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు జిల్లా ఎస్పీ కీలక సూచనలు చేశారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు దళారులు, నకిలీ వ్యక్తుల మాటలు నమ్మొద్దని కోరారు. భక్తులు కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, యాప్‌ల ద్వారానే సేవలు పొందాలని సూచిస్తున్నారు. ఎవరైనా తాము టీటీడీ ఉద్యోగులమని, అధికారులమని చెప్తే డబ్బులు కాజేసేందుకు ప్రయత్నిస్తే.. వెంటనే తమకు సామాచారం ఇవ్వాలని కోరారు.

# అద్దె భవనాల్లో అంగన్వాడీలు...

### సొంత భవనం కోసం ఎదురు చూపులు
### శిథిలావస్థలో భవనాలు.. భయం గుప్పిట్లో చిన్నారులు
### పట్టించుకోని అధికారులు.



రుద్రూర్, బతుకమ్మ :భావిభారత పౌరులను తీర్చిదిద్దే అంగన్‌వాడీ కేంద్రాలు అవస్థల మధ్య కొనసాగుతున్నాయి. సొంతభవనాలు లేక అద్దెభవనాల్లో అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నాయి. రుద్రూర్ మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థలో అద్దె భవనాల్లో కొనసాగుతుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగుప్పిట్లో చిన్నారులు బిక్కు బిక్కుమంటున్నారు. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, పిల్లలకు ఆటపాటతో విద్య అందించడం, నిద్రపుచ్చడం వంటివి చేయాలి. అయితే అద్దె భవనాలు ఇరుకుగా ఉండడం, అంగన్వాడీ కేంద్రం శిథిలస్థితిలో ఉండడంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో సరైన స్థలం లేకపోవడంతో పిల్లలు కూర్చునే సౌకర్యం కూడా లేదు. వర్షాకాలంలో అద్దె ఇళ్లలో నీరు చేరడం పైకప్పులు కారడం వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

